క్లుప్తంగా

కాలుష్యరహిత విశాఖకు కృషి



సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రతి ఒక్కరూ ప్రజా రవాణాను ఉపయోగించి విశాఖ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో–జీరో పొల్యూషన్‌లో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టిందన్నారు.

1 నుంచి గ్రూప్-2 మెయిన్స్ కోచింగ్ ప్రారంభం

డాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రూప్–2 స్టడీ సర్కిల్ నుంచి ప్రిలిమ్స్‌లో 98 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరందరికీ సోమవారం విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు వి.ఎస్.పద్మనాభరాజు, డాక్టర్ బి.గంగారావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ నిర్వాహకురాలు డాక్టర్ జి.ప్రియాంక మాట్లాడుతూ ఈ కేంద్రంలో ఇంతటి ఉత్తీర్ణత శాతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రూప్–2 మెయిన్స్ కోచింగ్ మే ఒకటి నుంచి ప్రారంభం కానుందని, ఆసక్తి గల అభ్యర్థులు 83745 37181, 88865 78595 నంబర్లలో సంప్రదించాలని కోరారు. రెండు నెలల పాటు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కోచింగ్ ఇస్తామని, గ్రూప్ చర్చలు, మోడల్ పరీక్షలు ఉంటాయన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మట్టుపల్లి హనుమంతరావు

డాబాగార్డెన్స్ : ఎండ తీవ్రత దృష్ట్యా విశాఖపట్నం ఎలక్ట్రికల్ డీలర్స్ అసోసియేషన్ సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించింది. స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని చలమాజీ ఇన్‌ఫ్రా చైర్మన్ మట్టుపల్లి హనుమంతరావు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేద రవి, అధ్యక్షుడు రాకేష్‌జైన్, వైస్ ప్రెసిడెంట్ మనోజ్, కోశాధికారి గుప్త ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఎండలు చాలా ఎక్కువగా ఉన్నందున, 45 రోజుల పాటు మజ్జిగ చలివేంద్రం కొనసాగించనున్నట్టు చెప్పారు. ప్రతి సంవత్సరం ఈ చలివేంద్రాన్ని వివేకానంద సంస్థ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల జోరు..



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కదిరి రాము

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గంలో నామినేషన్ల జోరు ఊపందుకుంది. ఈ నెల 20న వైఎస్సార్‌సీపీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్ నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం సెలవు. సోమవారం స్వతంత్ర అభ్యర్థులుగా తారకరామ్ లెగిసెట్టి, కంబేటి శ్రీదేవి, ఈశ్వరరావు కడగల నామినేషన్ వేయగా, బహుజన సమాజ్ పార్టీ నుంచి కదిరి రాము రెండు సెట్ల నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీతారామ్మూర్తికి అందజేశారు.

సర్కారీ బడులు.. చదువుల సిరులు

మన పిల్లలకు మనం **ఇచ్చే ఆస్తి ఏదైనా** ఉందీ అంటే.. అది చక్కటి **చదువు** మాత్రమే అని సీఎం **జగన్‌మోహన్‌రెడ్డి** అనేక సభల్లో ఎన్నోసార్లు **చెప్పారు.** అలాగే పేదరికాన్ని **జయించాలంటే ఉత్త**మంగా చదివి.. ఉన్నత **శిఖరాలకు** చేరుకుంటేనే అది **సాధ్యమవుతుందనే** వారు. అందుకే ఆర్థిక **ఇబ్బందులతో** బడికి పోని పిల్లలు సైతం **తరగతులకు** ఠంచన్‌గా హాజరయ్యేలా **ప్రభుత్వ** బడులను కార్పొరేట్ **స్థాయిలో తీర్చిది**ద్దారు. చక్కటి మౌలిక సదుపాయాలు కల్పించారు. నిపుణులైన అధ్యాపకులను నియమించారు. ఈ విధమైన చర్యలు తీసుకుంటే ఎలాంటి ఫలితాలు వస్తాయని ఆయన అనుకున్నారో.. నేడు విడుదలైన టెన్త్ ఫలితాల్లో అచ్చం అలాంటి ఫలితాలే వచ్చాయి. పదో తరగతిలో సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థులెందరో ప్రతిభ చాటారు. చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించారు. ఆర్థిక పరిమితుల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు దీటుగా రాణించారు. విశేష ప్రతిభతో తల్లిదండ్రుల కలలను నిజం చేశారు. ప్రభుత్వం విద్యకు అందిస్తున్న అన్ని సదుపాయాలను అందిపుచ్చుకున్నారు. ప్రభుత్వానికి కూడా మంచి పేరు తెచ్చిపెట్టారు.

- టెన్త్ ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- సీఎం జగన్ దార్శనికత నిజమైన వేళ
- ప్రభుత్వ కృషికి నేడు సత్ఫలితం
- మెరిసిన రైల్వే స్కూల్, ఎంజీఎం, సీఎంఆర్–జీవీఎంసీ, క్వీన్ మేరీ, దండుబజార్ ఎంవీడీ స్కూల్, ఎంవీడీఎం హైస్కూల్ విద్యార్థులు
- 580 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాల విద్యార్థిని సీహెచ్ దీప్తిశ్రీ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ, ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలల (సర్కార్ బడులు) నుంచి పదో తరగతి పరీక్షలకు వెళ్లిన విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించింది. పుస్తకాలు ఉచితంగా అందజేసింది. అమ్మఒడి అంటూ మాకు డబ్బులు వేసింది. ఇలా అన్ని సదుపాయాలు కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్న కృత నిశ్చయంతో ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాం. సర్కార్ బడుల్లో విద్య బాగుంటుందని సత్తా చూపించాం అంటున్నారు పిల్లలు.

క్వీన్ మేరీ పాఠశాల..

ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాల నుంచి 204 మంది బాలికలు పరీక్షలు రాయగా, 120 మంది ఉత్తీర్ణులయ్యారు. పాత నగరానికి చెందిన కనకమహాలక్ష్మి 555 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది.

దండుబజార్ ఎంవీడీ స్కూల్..

జీవీఎంసీ 30వ వార్డు పరిధి దండుబజార్ ఎంవీడీ స్కూల్ నుంచి 105 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 77 మంది ఉత్తీర్ణులయ్యారు. 573 మార్కులతో కె. కుమార్ బాబు పాఠశాల టాపర్‌గా నిలువగా, ఎనిమిది మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించారు.

సత్తా చాటిన ఎంజీఎం, రైల్వే స్కూలు విద్యార్థులు..

అల్లిపురం : టెన్త్ పరీక్షల్లో ప్రభుత్వ, జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ నుంచి 128 మంది హాజరు కాగా వారిలో 90 మంది ఉత్తీర్ణత సాధించారు. కొల్లి శైలజ 538 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చింది. కె. మేఘన 526, జె. లిఖితరెడ్డి 500 మార్కులు సాధించగా, ఏడుగురు విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు.

రైల్వే స్కూల్లో..

రైల్వే హైస్కూల్‌కు సంబంధించి 97 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 68 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గేదెల యశ్వంత్ 564 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచాడు. ఇతని తండ్రి జి. వేణుగోపాలరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తుండగా, తల్లి జీవీ రమణి ప్రైవేట్ జాబు చేస్తున్నారు.

ఎంవీడీఎం హైస్కూల్ నుంచి..

జగదాంబ : పాతనగరం 39వ వార్డు ఎంవీడీఎం హైస్కూల్ నుంచి 89 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 50 మంది ఉత్తీర్ణులయ్యారు. మొగ్గ సుమన్ 497 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలువగా, 478 మార్కులతో బొడ్డు చంటి, ఎం. సాయిరత్న, 477 మార్కులతో డి. వసంతలక్ష్మి ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు.



టెన్త్ ఫలితాల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించిన జీవీఎంసీ-ప్రకాశరావుపేట పాఠశాల

సత్తా చాటిన సీఎంఆర్ జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు



సీహెచ్ దీప్తిశ్రీ



సుమంత్



ఎం. చిన్నా

డాబాగార్డెన్స్ : సీఎంఆర్–జీవీఎంసీ పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలు రాసిన పిల్లలు అత్యధిక మార్కులు సాధించారు. వీరంతా బడుగు బలహీన వర్గాల వారే. తల్లిదండ్రులిద్దరూ రోజంతా కష్టపడితేనే వారి పోషణ. అటువంటిది చదువుకు పేదరికం అడ్డు రాదంటూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు వెళ్లిన సీహెచ్ దీప్తిశ్రీ అత్యధికంగా 580 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలువగా, 575 మార్కులతో కె. సుమంత్, 567 మార్కులతో ఎం. చిన్నా, 565 మార్కులతో కె. సుభాష్, 559 మార్కులతో షేక్ దిల్షా, 553 మార్కులతో ఎం. రిషిత సత్తా చాటారు. ఈ పాఠశాల నుంచి 77 మంది విద్యార్థులు హాజరు కాగా 76 (99 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 68 మంది ఫస్ట్‌క్లాస్, ఐదుగురు సెకండ్ క్లాస్, ముగ్గురు థర్డ్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు.



రైల్వే హైస్కూల్ విద్యార్థి యశ్వంత్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లితండ్రులు గణేష్, మంగ



రైల్వే హైస్కూల్ విద్యార్థి తిరుమలేసుకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు గోపాలరావు, రమణి



బొడ్డు చంటి



సాయిరత్న



వసంతలక్ష్మి



మోగి సుమన్

వాసుపల్లికి బి-ఫారం అందజేత



వైవీ సుబ్బారెడ్డి నుంచి బి-ఫారం అందుకుంటున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సోమవారం బి–ఫారం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణుల దీవెనలతో తాను మళ్లీ ఎమ్మెల్యేగా బరిలో ఉన్నానని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి బొత్స ఝాన్సీని ఎంపీగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

మహారాణిపేట : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆంధ్రా మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సోమవారం పానగల్ భవనంలో నిర్వహించిన వర్క్‌షాప్, మాక్ డ్రిల్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి డి. నిరంజన్‌రెడ్డి ఫైర్ ఫైటింగ్– రెస్క్యూయింగ్ గురించి తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ టి. మోహన్‌రావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్. రేణుకయ్య, ఎన్ఎస్ఎస్ ఏఎంసీ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ అరవింద్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గత ఐదు రోజులుగా సింగిల్ మేజర్ సబ్జెక్ట్స్‌పై నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారంతో ముగిసాయి. జోన్–1 పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖకు చెందిన ఎకనమిక్స్ అధ్యాపకులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ బోధనలో ఎప్పటికప్పుడు నూతన పద్ధతులు అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులు, కీ రీసోర్స్ పర్సన్లకు ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ రీసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేవీఎల్ శిరీష, వివిధ జిల్లాల అధ్యాపకులు, జేకేసీ మెంటార్ డి. ప్రజ్ఞ, టెక్నికల్ అసిస్టెంట్ బి. సునీల్ పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులతో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

టెన్త్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో నారాయణ స్కూల్ యాజమాన్యం

సీతమ్మధార: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో విశాఖపట్నం నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. షేక్ ఫరీదా 596/600 మార్కులు, ఎస్.తనుశ్రీ 592 మార్కులు, కె.చందన 590 మార్కులు సాధించి సత్తా చాటారు. 28 మందికి 580పైగా మార్కులు వచ్చాయి. ఏజీఎం రాజ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ మణి

రవీంద్రభారతి విద్యార్థుల సత్తా..

డాబాగార్డెన్స్ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో డాబాగార్డెన్స్ రవీంద్రభారతి విద్యార్థులు సత్తా చాటారు. ధర్మతేజస్విని 588 మార్కులు, నిహారిక 561, లహరి మాణిక్యం 557 మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాలల చైర్మన్ ఎంఎస్ మణి అభినందించారు.

సీఎం జగన్‌తోనే పేదల బతుకులకు భరోసా

- 38వ వార్డు ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



విశ్వబ్రాహ్మణుల వృత్తిలో వాసుపల్లి..



జై జగన్..జై వాసుపల్లి అంటూ నినదిస్తున్న పెద్దాయనతో వాసుపల్లి

డాబాగార్డెన్స్ : ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో దక్షిణ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రచారం ముమ్మరం చేశారు. సోమవారం 38వ వార్డులో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వార్డు నుంచి పలువురు జనసేన పార్టీకి చెందిన యువకులు వాసుపల్లి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి వాసుపల్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల పార్టీలో చేరిన జనసేన మత్స్యకార విభాగం నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాసరావుతో కలిసి వాసుపల్లి ఓటర్లను అభ్యర్థించారు. వార్డు నాయకుడు సన్యాసిరావు నేతృత్వంలో నిర్వహించిన ప్రచారం గాంధీ బొమ్మ నుంచి ప్రారంభమైంది. సోల్జర్‌పేట, పప్పులవీధి, మట్టా వెంకటప్పవీధి, హుకుంవారి వీధి, గాజులవీధి, గంగాబత్తుల వారి వీధి, బొబ్బిలివీధి, ముసలికంటి వారి వీధి, చింతకాయల వీధి, టౌన్ హాల్ ప్రాంతంలో ప్రచారం సాగింది. ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని వాసుపల్లి ఓటర్లను అభ్యర్థించారు. 38వ వార్డులో పేద విశ్వబ్రాహ్మణులు ఉన్నారని, అలాగే వృత్తి సమస్యలు ఉన్నాయన్నారు. మత్స్యకారుల్లో 95 శాతం వాడబలిజలు ఉన్నారన్నారు. ప్రజలు తనని గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం జగన్ ఆదివారం విశాఖలో నిర్వహించిన సిద్ధం బస్సు యాత్రకి నియోజకవర్గం అన్ని వార్డుల నుంచి దాదాపు 20 వేల మంది జనహృదయ నేతను చూసేందుకు వచ్చారన్నారు. బెహరా వెంకటరత్నం, ఉమ్మడి సుధ, కోసూరు వాసు, సుజాత, బర్రి కొండబాబు, సారిపల్లి అరుణ, పెదబాబు, గురజాపు రవి, బల్లి శ్రీను, పట్టా స్వామి, ఉమ్మడి వంశీకృష్ణ, వాడమదుల దిలీప్, నరేష్, చిన్ని కృష్ణ, ఆదిత్య, పెద్ద ఎత్తున వార్డు ప్రజలు పాల్గొన్నారు.



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న వాసుపల్లి



ఇస్త్రీ చేస్తూ వాసుపల్లి ప్రచారం



మూగి శ్రీనివాసరావుతో కలిసి మామిడి బద్దలు విక్రయిస్తున్న వాసుపల్లి

వైఎస్సార్‌సీపీలో చేరికల జోష్..

- ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న పలువురు నాయకులు, కార్యకర్తలు
- సీఎం జగన్ పాలనకు మెచ్చి పార్టీలో చేరినట్లు వెల్లడి



పార్టీలో చేరిన 30వ వార్డు జనసేన యువతతో వాసుపల్లి

అల్లిపురం : వైఎస్సార్‌సీపీలో ఇతర పార్టీల నుంచి చేరికలు జోరుగా సాగుతున్నాయి. దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో సోమవారం వివిధ వార్డుల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు చేరారు.

30వ వార్డు నుంచి..

వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, సీనియర్ నాయకుడు దశమంతుల మాణిక్యాలరావు, సురకల వేణు, బాలు ఆధ్వర్యంలో సుమారు వంద మంది జనసేన యువత పార్టీలో చేరారు.

39వ వార్డులో..

జేసీఎస్ మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో వార్డులో 116వ బూత్ జనసేన అధ్యక్షుడు వై.రమేష్ పార్టీలో చేరారు. అతనిని వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు.



జనసేన నాయకుడు రమేష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి

వాసుపల్లికి సీ పోర్టు కార్మికుల మద్దతు..

39వ వార్డుకి చెందిన సీ పోర్టు కార్మికులు ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లికి మద్దతు తెలిపారు. జేసీఎస్ మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. వారిని వాసుపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

35వ వార్డు నుంచి..

వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో 60 మంది జనసేన కార్యకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. జనసేన విధి విధానాలు నచ్చక పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.



వాసుపల్లికి మద్దతు తెలియజేసిన 30వ వార్డు యువత



పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో వాసుపల్లి

పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు..

30వ వార్డు కార్పొరేటర్ కోడూరి అప్పలరత్నం ఆధ్వర్యంలో శ్రీ పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లికి మద్దతు పలికారు

30వ వార్డు యువత మద్దతు..

తాడివీధికి చెందిన తొలి ఓటర్లు తాడి రవితేజ, కోన శంకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరి వాసుపల్లికి మద్దతు తెలిపారు. వారికి కండువా కప్పి వాసుపల్లి గణేష్‌కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు.

34వ వార్డు యువత మద్దతు..

వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో అచ్చియ్యమ్మపేట యువత పార్టీలో చేరారు. వారిని వాసుపల్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 100 మంది..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన యువత, మహిళలు సుమారు 100 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డు కార్యాలయంలో సోమవారం సాయంత్రం పార్టీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకోవాలనే లక్ష్యంతో పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.



పార్టీలో చేరిన వారితో జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్